క్లుప్తంగా

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

లక్ష్మీపురం: కూటమి ఎన్నికల హామీలలో భాగంగా ఆటో కార్మికులకు ప్రతి సంవత్సరం రూ.15 వేల ఆర్థిక సాయం హామీని నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని శనివారం సంఘ కార్యాలయం

కార్పొరేట్ శక్తుల నుంచి దేవదాయ భూములను కాపాడుకుందాం

లక్ష్మీపురం: పేద ప్రజలు పోరాడి సాధించుకున్న దేవదాయ భూములను అంబానీ, అదానీలు వంటి కార్పొరేట్ శక్తులు కబ్జా చేసేందుకు హిందుత్వ శక్తులు శంఖారావం పూరించాయని సీపీఐ(ఎంఎల్) డెమోక్రసీ రాష్ట్ర నాయకులు పి.ప్రసాద్ పేర్కొన్నారు. బ్రాడీపేటలో శనివారం పార్టీ నాయకుడు ఫణి 5వ వర్ధంతి సభ జిల్లా కార్యదర్శి విష్ణు అధ్యక్షతన నిర్వహించారు.

ఉద్యోగాలకు 14 మంది ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్ర(జేకేసీ) ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్ నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌లో 14 మంది విద్యార్థినులు కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ ఫ్యాకల్టీ ఉద్యోగాలకు శనివారం ఎంపికయ్యారు. వివిధ కళాశాలల నుంచి పాల్గొన్న విద్యార్థినులకు కమ్యూనికేటివ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌ను పరిశీలించిన ఐఎల్ఎం ప్రతినిధులు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి పర్యవేక్షణలో జరిగిన ఎంపిక ప్రక్రియను ఐఎల్ఎం ప్రతినిధి గౌస్ పాషా, జేకేసీ సమన్వయకర్త డాక్టర్ అపర్ణ సీతారామ్, మెంటార్లు యూనిస్ఖాన్, కె.అపర్ణ నిర్వహించారు.

నేటి నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా

నెహ్రూనగర్: మూడు వంతెనల పరిధిలో ఆదివారం తాగునీటి సరఫరా ఉదయం పాక్షికంగాను, సాయంత్రం యథావిధిగా ఉంటుందని కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని మూడు వంతెనల వద్ద సంగంజాగర్లమూడి నుంచి నాజ్ సెంటర్ రిజర్వాయర్‌కు తాగునీటి సరఫరా జరిగే 700 ఎంఎం డయా సిఐ పైప్ లైన్ షిఫ్టింగ్ పనులను శనివారం రాత్రికి ఇంజినీరింగ్ అధికారులు పూర్తి చేశారు.

జీజీహెచ్‌లో లోకేష్ పుట్టినరోజు వేడుకలపై విమర్శలు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ శుశ్రుతా హాలులో మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహ్మద్ నసీర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. అయితే పుట్టినరోజు వేడుకల్లో భాగంగా శుశ్రుతాహాలు అంతా పసుపు మయంగా మార్చి వేశారు. మంత్రి లోకేష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ శుశ్రుతాహాలులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ జ్యోతుల మురళీ ఫొటోలు టీడీపీ నేతల ఫొటోలతోపాటుగా ముద్రించటంపై పలువురు విమర్శలు ఎదుర్కొంటున్నారు. డాక్టర్ రమణ యశస్వి వ్యక్తిగత పనుల కోసం వారం రోజులపాటు సెలవు పెట్టారు. ఆయన సెలవులో ఉండగానే నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకల పేరుతో ఆస్పత్రి శుశ్రుతాహాలును పార్టీ వేదికగా మార్చారని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి.

స్టాటిస్టిక్స్ అతిథి అధ్యాపకుల నియామకం

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల స్టాటిస్టిక్స్ విభాగంలో అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 29వ తేదీలోగా దరఖాస్తు చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి శనివారం ఒక ప్రకటనలో కోరారు. అభ్యర్థులు పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, నెట్, స్లెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని, రెజ్యూమ్, దరఖాస్తుతో కళాశాలలోని గణిత, స్టాటిస్టిక్స్ విభాగంలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు స్టాటిస్టిక్స్ విభాగాధిపతి పి.నిర్మలాకుమారిని 98668 05421 నంబర్లో సంప్రదించాలని కోరారు.

అంబేడ్కర్ భవన్ నిర్మాణం పూర్తికి అంచనాలు సిద్ధం చేయాలి

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

నెహ్రూనగర్: ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ భవన్ నిర్మాణం పూర్తికి అంచనాలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, అధికారులను ఆదేశించారు. పురోగతిలో ఉన్న అంబేడ్కర్ భవన్‌ను శనివారం పరిశీలించారు. పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అవసరమయ్యే అంచనా వ్యయంపై ప్రణాళికా సిద్ధం చేయాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) డి.అనిల్ కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు.

నేను.. నా స్టేటస్!

మాట.. పాట.. ఆట.. ఆనందం.. ఆశ్చర్యం.. విషాదం వార్తలు.. విశేషాలు.. వింతలు శుభాకాంక్షలు.. విమర్శలు.. సూచనలు విద్య. ఉద్యోగం.. వ్యాపారం.. పుట్టుక.. పెళ్లి.. చావు.. ఆధ్యాత్మికం.. విహారం.. ఆరోగ్యం.. ఇలా.. అన్నీ ఒకే వేదికపై అందరితో స్మార్ట్‌గా పంచుకుంటున్నారు. 'నా స్టేటస్.. నా ఇష్టం'.. అంటూ రోజూ అందరినీ పలకరిస్తూ సాగిపోతున్నారు.

- వాట్సాప్ స్టేటస్‌లో మనోభావాలు వ్యక్తీకరణ
- అక్కడే సూక్తులు, పరోక్షంగా విమర్శనాస్త్రాలు
- అధిక శాతం భక్తి సంబంధిత విషయాలు పోస్టు
- వ్యాపార ప్రకటనలకు అదే మార్గం
- వ్యక్తిగత ప్రతిభకు వేదిక
- స్టేటస్‌ను విస్తృతంగా వాడుతున్న యువత

పట్నంబజారు: సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవడానికి సోషల్ మీడియా ఇప్పుడొక వేదికగా మారింది. అందులో ఇటీవల కాలంలో వాట్సాప్ యాప్‌లోని ఫీచర్ అయిన స్టేటస్‌ను ఉపయోగించుకుంటున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఆధునిక టెక్నాలజీకి అలవాటుపడ్డ ఈ తరుణంలో 'స్టేటస్'లో పోస్టు పెట్టడమనేది ఒక స్టేటస్ భావిస్తున్న వారూ ఉన్నారు. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగామ్ తదితర మాధ్యమాలు ఉన్నప్పటికీ ఎక్కువగా వాట్సాప్ స్టేటస్ వేదిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో జనాభా దాదాపు 30 లక్షల మంది వరకు జనాభా ఉంటుంది. అందులో పిల్లలు మినహాయిస్తే 22 లక్షల మంది వరకు యుక్త వయస్సు నుంచి వృద్ధుల వరకు ఉంటారు. వీరిలో దాదాపుగా 15లక్షల నుంచి 18 లక్షల వరకు స్మార్ట్ ఫోన్ వాడుతున్నారని అంచనా. దాదాపుగా స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ వాట్సాప్ వినియోగిస్తూనే ఉన్నారు. వాట్సాప్ ఉపయోగించే వారందరూ స్టేటస్‌లో వారికి నచ్చిన అంశాలను పోస్టు చేస్తూ ఉండటం లేదా చూస్తూ ఉండటం చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం వరకు వాట్సాప్ యాప్ ఉప యోగించే వారిలో 10 నుంచి 20 శాతం మాత్రమే స్టేటస్ ఫీచర్‌ను ఉపయోగించేవారు. ఇప్పుడు 80 శాతం మంది ఈ ఫీచర్‌ను చూస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా వాట్సాప్ స్టేటస్‌లో వారు పోస్టు చేసేదాన్ని బట్టి వారు ఎలాంటి వారు, వారి మనస్తత్వమేమిటో ఇట్టే చెప్పేయవచ్చని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

దేవుళ్లు.. దేవతలు..

వాట్సాప్ స్టేటస్ తో చాలా ఉపయోగాలు ఉన్నప్పటికీ. 50 శాతం మంది ఏ రోజుకు ఆ రోజు సంబంధిత దేవుళ్ల ఫొటోలు, పాటల వీడియోలు పోస్టు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీటిని చూసిన అదే రకమైన వారు ప్రతిస్పందిస్తూ లైక్లు, కామెంట్లు పెడుతున్నారు.

మనోభావాలు వ్యక్తం చేస్తూ..

కొందరు వారి మనోభావాలను తెలియజేసే విషయాలు ఎంపిక చేసుకుని స్టేటస్‌లో పోస్టు చేస్తూ ఆనందిస్తున్నారు. ఇవి వారికి నచ్చిన వారికి మంచిగా, నచ్చని వారికి చెడుగా స్ఫురింపవచ్చు. ఆ కోట్స్ పోస్టు చేసిన వ్యక్తిని బట్టి ఎవరు ఎలా రిసీవ్ చేసుకుంటే అలా కనిపిస్తాయి. ఒక విధంగా పోస్టు చేసిన వ్యక్తి మనోభావాలు ఇలా స్టేటస్ రూపంలో ప్రతి స్పందిస్తాయనడంలో సందేహం లేదు. చాలా మంది వారికి జరిగిన మంచి, చెడును ఇతరులకు చెప్పేందుకు స్టేటస్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇందుకు సంబంధించిన చిత్రాలను పోస్టు చేస్తున్నారు..



ఇట్లు.. మేము బాగున్నాం....

ఇప్పుడున్న బిజీ లైఫ్‌లో బంధువులు, స్నేహితులకు కనీసం ఫోన్లు చేసి యోగక్షేమాలు తెలుసుకునే సమయం ఉండటం లేదు. ఈ క్రమంలో వాట్సాప్ స్టేటస్‌ను ప్రతి ఒక్కరూ చక్కగా ఉపయోగించుకుంటున్నారు. స్టేటస్ ఒక లేఖలా మారిపోయింది. ఉదాహరణకు ఏదైనా విహార, శుభకార్యాలు, తీర్థయాత్రకు వెళ్లారంటే అందుకు సంబంధించిన ఏ రోజుకు ఆ రోజు ఫొటోలు సమయంతో సహా కుటుంబసభ్యులంతా ఉండే ఫొటోలు పోస్టు చేసి ఆనందిస్తున్నారు.

బిజినెస్‌కు వేదికగా..

వ్యాపారాభివృద్ధికి సోషల్ మీడియా కూడా ఒక ప్రచార వేదికగా మారింది. అందులో అందరూ ఎక్కువగా చూసే వాట్సాప్ స్టేటస్‌ను చాలా మంది వ్యాపారులు తమ వ్యాపారాభివృద్ధి కోసం ఉపయోగించుకుంటున్నారు. వ్యాపారం గురించి వివిధ రూపాల్లో బ్రోచర్లు ముద్రించి స్టేటస్‌లో పోస్ట్ చేస్తున్నారు.

వ్యక్తిగత ప్రతిభ చాటడానికి...!

చాలా మంది తమ వ్యక్తిగత ప్రతిభ చాటడానికి స్టేటస్‌ను ఉపయోగించుకుంటున్నారు. ఎందులోనైనా వారు ప్రతిభ సాధించి ఉంటే అప్పటికప్పుడు స్టేటస్‌లో పోస్టు చేస్తు ఉన్నారు. లేదా వారి కుటుంబ సభ్యుల్లో ఎవరు ప్రతిభ సాధించినా పోస్టు చేస్తున్నారు. ఈ పోస్టును చూసిన వారు తప్పక అభినందనలతో ముంచెత్తుతున్నారు. దీనివల్ల మానసికానందం పొందుతున్నారు. ముఖ్యంగా వివాహాది శుభకార్యాలు, వ్యాపారాభివృద్ధి, విద్య, ఉద్యోగాల్లో ప్రతిభ చాటడం, క్రీడల్లో సత్తా చాటడం వంటి అంశాలను స్టేటస్‌లో పోస్టు చేసి వాటిని చూసిన వారి నుంచి ప్రశంసలు పొందుతున్నారు.

విద్యార్థుల పేర్లు తొలగింపు సరికాదు



ఆర్జేడీ లింగేశ్వరరెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న బసవ లింగారావు, ఖాలీద్

గుంటూరు ఎడ్యుకేషన్: బోగస్ ఎన్‌రోల్‌మెంట్ పేరుతో వ్యవసాయ పనుల కోసం తాత్కాలికంగా తల్లిదండ్రులతో వలస వెళ్లిన విద్యార్థుల పేర్లను పాఠశాలల నుంచి మూకుమ్మడిగా తొలగించడం సరైంది కాదని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, మొహమ్మద్ ఖాలీద్ పేర్కొన్నారు. శనివారం పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ సీవీ రేణుకలను వారి కార్యాలయంలో కలిసిన ఏపీటీఎఫ్ ప్రతినిధులు ఈ మేరకు వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం బసవ లింగారావు మాట్లాడుతూ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి మౌలిక వసతులు, అదనపు గదుల ఏర్పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులే చూసుకోవాలనడం సహేతుకంగా లేదన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఖాళీలను నెలవారీ పదోన్నతులు పునరుద్ధరణ చేసి భర్తీ చేయాలని కోరారు. అధికారులను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.లక్ష్మీనారాయణ, కార్యదర్శులు ఎస్ఎస్ఎన్ మూర్తి, జి.దాస్, వందనం, షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక, శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదం

–శాప్ చైర్మన్ రవినాయుడు



మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు, పక్కన భాష్యం రామకృష్ణ, హనుమంతరావు

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలు మానసిక, శారీరక దారుఢ్యానికి దోహదం చేస్తాయని ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ(శాప్) చైర్మన్ ఎ.రవినాయుడు అన్నారు. భాష్యం ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్- బీపీఎల్ 2024-25లో భాగంగా శనివారం జేకేసీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లను రవినాయుడు ముఖ్య అతిథిగా ప్రారంభించారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచేందుకు భాష్యం విద్యాసంస్థలు ఇటువంటి క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. ఎంతో శ్రమకోర్చి 720 క్రికెట్ మ్యాచ్‌లను నిర్వహించడం సాధారణ విషయం కాదని, భాష్యం రామకృష్ణ విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదల కోసం ఇటువంటి పోటీలు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. చదువుతో పాటు వారు ఎంచుకున్న రంగాల్లో యువతను ప్రోత్సహిస్తే భవిష్యత్‌లో ఉన్నత విజయాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులకు శుభాభినందనలు తెలిపారు. భాష్యం చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా భాష్యం విద్యాసంస్థలు పనిచేస్తున్నాయని చెప్పారు. ముందుగా భాష్యం ప్రీమియర్ లీగ్ జెండా, భాష్యం జెండాలను ఆవిష్కరించి బెలూన్లను ఎగురవేశారు. అనంతరం క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లో సరసరావుపేట నింజాస్ జట్టుపై వైజాగ్ వెలాసిటీ-3, వెస్ట్ గోదావరి వారియర్స్‌పై హైదరాబాద్ హైలాండర్స్-2 జట్టు విజయం సాధించింది. పోటీల్లో గెలుపొందిన జట్లకు చైర్మన్ భాష్యం రామకృష్ణ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్ పాల్గొన్నారు.

అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించండి

ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా



గుంటూరు వెస్ట్: ఎస్ఎస్‌పీ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగుల్లో అర్హులైన వారిని గుర్తించి పదోన్నతులు కలిపించాలని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా ప్రాజెక్ట్ ఇంజనీర్ బి.శ్యామ్ ప్రసాద్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. అర్హులైన కొందరు ఉద్యోగులకు ఏడు సంవత్సరాల నుంచి పదోన్నతులకు నోచుకోలేదన్నారు. పనిచేసే వారిని గుర్తిస్తే వారి సమర్థతను మరింత ఎక్కువగా ఉపయోగించుకునే వీలుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ, బి.శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, పెద కోటయ్య పాల్గొన్నారు.

ఉన్నతమైన ఆలోచనలతో ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



పుస్తకాల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

నగరంపాలెం: ప్రతి విద్యార్థీ ఉన్నత విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు న్యూ మోడల్ టెస్ట్ పేపర్ – 2025 పుస్తకాలను శనివారం వేణుగోపాల్‌నగర్‌లోని మున్సిపల్ పాఠశాల ఆవరణలో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ అబ్దుల్ కలాం చెప్పినట్లు భవిష్యత్‌పై బంగారు కలలు కని, వాటిని సాకారం చేసుకోవాలని తెలిపారు. ఆలోచనలు ఉన్నతంగా ఉండాలని, ఆచరణకు సంబంధించి సంకల్పం బలంగా ఉన్నట్లైతే ఏదైనా సాధించవచ్చునని చెప్పారు. మున్సిపల్ పాఠశాలల్లో 95 శాతం ఫలితాన్ని సాధించిన ప్రతి విద్యార్థికీ రూ.5 వేలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్, ప్రతినిధులు డాక్టర్ పోలే ముత్యం, కంజుల సత్యనారాయణరెడ్డి, పాఠశాల హెచ్ఎం పద్మావతి, కార్పొరేటర్లు పడాల సుబ్బారెడ్డి, షేక్ రోషన్, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), పాపతోటి అంబేడ్కర్, బూసి రాజలత, గురవయ్య, అచ్చాల వెంకటరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పరిశపోగు శ్రీనివాసరావు, నూనె ఉమామహేశ్వరరెడ్డి, షేక్ రబ్బాని, కౌండిన్య, సురసాని వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులను సమన్వయంతో చేపట్టాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగరంలోని తారకరామ నగర్ మెయిన్ రోడ్ విస్తరణ పనులను పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ తారకరామ నగర్, ఎస్వీఎన్ కాలనీ, పెద్ద పలకలూరు రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. తొలుత తారకరామ నగర్ రోడ్డు విస్తరణ పనుల పురోగతిపై పట్టణ ప్రణాళిక అధికారులు, రోడ్ నిర్మాణ పనులపై ఇంజినీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విస్తరణ పనులు వేగంగా జరగాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని కేటాయించుకోవాలని చెప్పారు. విస్తరణ ప్రభావిత భవనాలకు చట్ట ప్రకారం నష్ట పరిహారం, స్థలాలకు టీడీఆర్ బాండ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఏసీపీని ఆదేశించారు. పెద్ద పలకలూరులోని సత్య అపార్ట్‌మెంట్ ప్రాంతాన్ని పరిశీలించి, స్థానికులతో మాట్లాడి పారిశుద్ధ్య పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ని ఆదేశించారు. డ్రైయినేజీ సమస్య, వీధి దీపాల సమస్యలు పరిష్కారానికి జీఎంసీ నుంచి అవసరమైన చర్యలు తీసుకోవాలని డీఈఈని ఆదేశించారు. పెద్ద పలకలూరు చెరువుని పరిశీలించి, చెరువులో నీటి నిల్వకు, సదరు ప్రాంతంలో బోర్ వెల్ ఏర్పాటు చేసి స్థానిక ప్రాంతాల్లోకి సరఫరా చేయడానికి, చెరువు చుట్టూ జంగిల్ క్లియర్ చేయాలని డీఈఈని ఆదేశించారు. పర్యటనలో డీఈఈ శ్రీనివాస్, ఏసీపీ రెహ్మాన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్ అవినీతిపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలి

- నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు
- బుడమేరు వరదల పేరుతో రూ.9.23 కోట్లు దుర్వినియోగం
- ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.10 కోట్లు వాడేశారు..



విలేకరులతో మాట్లాడుతున్న బాలవజ్రబాబు

నెహ్రూనగర్: విజయవాడ బుడమేరు వరదల పేరుతో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు రూ.9.23 కోట్ల దుర్వినియోగం చేశారని.. దీనిపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు(డైమండ్ బాబు) డిమాండ్ చేశారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.10 కోట్లు డ్రా చేసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. జనవరి 4న జరిగిన కౌన్సిల్ సమావేశంలో వరదలకు సంబంధించి ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఎంత వినియోగించారనే అనే ప్రశ్న సభ్యులు వేస్తే సభ నుంచి వాకౌట్ చేసిన వెళ్లిపోయిన తరువాత తిరిగి కౌన్సిల్ ఏర్పాటు చేయలేదని చెప్పారు. స్టాండింగ్ కమిటీ పేరుతో కౌన్సిల్‌ను నిర్వహించకుండా చేశారని ఆరోపించారు.

ఫుడ్ ప్యాకెట్స్ నగర శివారులో పడేశారు..

వరదలకు తీసుకెళ్లాల్సిన ఫుడ్ ప్యాకెట్స్, నగర శివారు ప్రాంతమైన చినకొండ్రుపాడు వద్ద కొన్ని వేల ప్యాకెట్లు పడేశారని.. వీటికి సంబంధించిన ఫొటోలను, వీడియోలను మీడియాకు చూపించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు విజయవాడలో ఒక వార్డు మాత్రమే కేటాయించారని, కాని విజయవాడ మొత్తానికి సరిపడ ఫుడ్ ప్యాకెట్లు, పాల ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు గుంటూరు నుంచి విజయవాడకు తీసుకువెళ్లారని కమిషనర్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

అనధికార కట్టడాల పేరుతో దోపిడీ..

నగరంలో అనధికార కట్టడాల పేరుతో టౌన్ ప్లానింగ్ అధికారి(ఏసీపీ) రెహ్మాన్ దోపిడీకి తెరదీశారని... రెండు సార్లు ఏసీబీకి చిక్కిన వ్యక్తికి కీలక పోస్టు ఇచ్చినట్లు పేర్కొన్నారు. 1147 అనధికార కట్టడాలు గుర్తించి వాటికి నోటీసులు ఇచ్చారని.. ఈ అక్రమ కట్టడాల వలన రూ.4 కోట్లు ఫైన్ రూపంతో రావాల్సి ఉందని కమిషనర్ చెప్పారని... వీటిని వసూలు చేశారా...అని ప్రశ్నించారు. వీటిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. నోటీసులు ఇచ్చిన వారి నుంచి భారీ స్థాయిలో ముడుపులు తీసుకున్నారని, ముడుపులు ఇవ్వనివారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు.

నేను దళితుడని ఎప్పుడు చెప్పుకోలేదు

దళిత కమిషనర్‌పై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారంటూ దళిత నేతలు మీడియా సమావేశం నిర్వహించడంపై విస్మయం వ్యక్తం చేశారు. కమిషనర్ తమ్ముడు ఒంగోలు నుంచి వచ్చి దళిత నేతలను కలసి ప్రెస్ మీట్‌లు పెట్టిస్తున్నారని ఆరోపించారు. కమిషనర్ దళితుడైతే అవినీతి చేయెచ్చా.. నేను దళితుడినే.. కాని ఎప్పుడు కూడా కులం పేరు చెప్పుకోలేదన్నారు. కమిషనర్ అవినీతికి పాల్పడక పోతే కౌన్సిల్‌లో నిరూపించుకోవాలన్నారు. కౌన్సిల్ నిర్వహించాలని మేయర్ కోరిన కూడా లెక్క చేయకుండా కౌన్సిల్ ఏర్పాటు చేయలేదని ధ్వజమెత్తారు. కమిషనర్ వద్ద సాక్ష్యాలు లేవు కాబట్టే పెండింగ్‌లో ఉన్న స్టాండింగ్ కమిటీ ఎన్నికను తెరమీదకు తీసుకొచ్చారని ఆరోపించారు.

కూటమి ప్రభుత్వం సూపర్ ఫ్లాప్



జిల్లా కలెక్టరేట్ వద్ద థాలీ బజావ్ కార్యక్రమం ద్వారా నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి

లక్ష్మీపురం: రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి కలెక్టరేట్ ఎదురుగా థాలీబజావ్, అనే వినూత్న(పళ్ళెం మోగించడం) కార్యక్రమం చేపట్టారు. సూపర్ సిక్స్- సూపర్ ఫ్లాప్ అంటూ నినదించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శనివారం మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి ఆధ్వర్యంలో థాలీ బజావ్ కార్యక్రమంలో భాగంగా నినాదాల హోరెత్తించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చిలకా విజయ్ కుమార్, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం పాల్ విజయ్ కుమార్, వెస్ట్ ఇంచార్జి డాక్టర్ రాచకొండ జాన్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆఫీస్ ఇన్‌చార్జి బిళ్లా సునీల్, పార్టీ నాయకులు గాదె నాగేశ్వరరావు, యాన్నం సుధీర్ బాబు, పాలపాటి అనిల్, సుభాని, నాగూర్ బాబు, వాల్మీకి శ్రీనివాసరావు, రత్తయ్య, సలీమ్ పాల్గొన్నారు.

సద్గురు త్యాగబ్రహ్మ ఆరాధనా మహోత్సవాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురంలోని శ్రీత్యాగరాజ కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న సంగీత జగద్గురు త్యాగబ్రహ్మ 178వ ఆరాధనా మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, ప్రధాన కార్యదర్శి ఎం.వై.శేషు రాణి సంయుక్తంగా వేద పండితుల వేద పఠనంతో డాక్టర్ చంద్ర రాధా రాణి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం స్థానిక కళాకారులతో శ్రీత్యాగరాజ కీర్తనల గానం జరగ్గా, సరయు మాల్కోస్ వీణ కచేరి అలరించింది. న్యాయవాది గోవిందరాజుల సాయికృష్ణశ్రీనివాస్, హోమియో ఫిజీషియన్ డాక్టర్ జె.ఎస్.ఎస్. ఎల్. నరసింహారావు హాజరై, కళాకారులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితాదేవి, కార్యదర్శి ఏ.వీ.మంగాదేవి పాల్గొన్నారు.

రైతు సంఘాల నిరసన ర్యాలీ

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి. ప్రసాద్, జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ రైతు కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బైక్ ర్యాలీ శనివారం నిర్వహించారు. గుంటూరు శంకర్‌విలాస్, లక్ష్మీపురం, బృందావన్‌గార్డెన్స్, గుజ్జనగుండ్ల సెంటర్ మీదుగా ర్యాలీ సాగింది. వారు మాట్లాడుతూ ఆదివారం మండల స్థాయిలో నిర్వహించనున్న నిరసన ర్యాలీలో అందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘ నాయకులు, సీఐటీయూ, సీపీఎం, ఐద్వా, ఆవాజ్ ఏఐవైఎఫ్, డీవైయఫ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.


బీజేపీ ఆధ్వర్యంలో రాజ్యాంగ సమ్ విధాన్ దివస్

గుంటూరు మెడికల్: బీజేపీ ఆధ్వర్యంలో శనివారం రాజ్యాంగ సమ్ విధాన్ దివస్ కార్యక్రమాన్ని స్థానిక కొత్తపేటలో నిర్వహించారు. ఈసందర్భంగా భరతమాత చిత్రపటానికి, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ రాజ్యాంగం అంటే కనీస గౌరవం లేని కాంగ్రెస్‌పార్టీ ఈరోజు రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని చేతబట్టుకుని ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొడుతున్నారని చెప్పారు. బీజేపీ గుంటూరు తూర్పు అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నేరెళ్ల మాధవరావు, చిలకా కుమార్ గౌడ్, సుబ్బారావు, సురేష్, అనిల్, అంజిరెడ్డి, ఆరీఫ్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

లక్ష్మీపురం: ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, దేశ రాష్ట్ర భవిష్యత్‌ని నిర్ణయించే సాధనమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఓటరు దినోత్సవం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్టీసీ అధికారి మల్లేశ్వరరావు మాట్లాడారు.

ఉద్యోగాలకు 51 మంది విద్యార్థుల ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలో శనివారం బెంగళూరుకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్ నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌లో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న 51 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ తెలిపారు. వివిధ దశల్లో నిర్వహించిన ఎంపిక ప్రక్రియకు జేకేసీ కళాశాల నుంచి పాల్గొన్న 210 మంది విద్యార్థుల్లో 51 మంది, విజ్ఞాన్ డిగ్రీ కళాశాల నుంచి పాల్గొన్న 70 మందిలో 19 మంది చొప్పున ఉద్యోగాలను పొందినట్లు వివరించారు. వీరు నెలకు రూ.21 వేల వేతనంతో నియమించబడ్డారని తెలిపారు. ఈసందర్భంగా కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ అధికారి డాక్టర్ వై.సురేష్‌బాబు విద్యార్థులను అభినందించారు.

హెచ్ఐవీ టెస్టింగ్ వాహనం ప్రారంభం



గుంటూరు మెడికల్: గ్రామీణ ప్రాంతాల్లో ఆస్పత్రికి వచ్చి హెచ్ఐవీ టెస్టులు చేయించుకోలేనివారి కోసం ప్రభుత్వం నూతనంగా జిల్లాకు కేటాయించిన హెచ్ఐవీ టెస్టింగ్, కౌన్సెలింగ్ వాహనాన్ని శనివారం డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ నియంత్రణే లక్ష్యంగా గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో హెచ్ఐవీపై అవగాహన కల్పించి టెస్టులు చేసేందుకు నూతన వాహనం అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ భుక్యా లక్ష్మానాయక్, శ్యామ్‌సన్, వీరాస్వామి, శ్రీనివారాజు, జయప్రసాద్ పాల్గొన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
BAJAJ RE DIESEL BS VI
2024 MODEL AP39 UU 4521
Cell : 99593 46623
6-9-17, 1st Floor, Ratna Deepika Plaza, Arandalpeta 9/1, GUNTUR.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు వెస్ట్)
9912220356
Office mail : sakshigntadvt@gmail.com